జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 70॥ గురువారం ॥ 6-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

06 ఆగస్టు 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:00 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి అష్టమి సా. 6:48 వరకు తరువాత నవమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం భరణి రా. 8:09 వరకు తరువాత కృతిక యోగం గండ మ. 2:54 వరకు కరణం భాలవ ఉ. 7:50 వరకు కౌలవ సా. 6:48 వరకు వర్జ్యం ఉ. 6:28 నుండి ఉ. 8:00 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:19 నుండి సా. 4:10 వరకు రాహుకాలం మ. 1:57 నుండి మ. 3:32 వరకు యమగండం ఉ. 6:00 నుండి ఉ. 7:35 వరకు గుళికాకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:24 నుండి తె. 5:12 వరకు అమృత ఘడియలు మ. 3:37 నుండి సా. 5:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: ((౦ అనగా మరుసటి రోజున




## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర
# అనుమతులు ఇప్పించండి

**కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఈ అంశంపై తెలంగాణ--మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (మన దీపం): బుధవారం ఢిల్లీలో జల్ శక్తి మంత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్న సీఎం, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖను, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తి శాఖకు పంపిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరిందని సీఎం గుర్తు చేశారు. అయితే పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (CWPRS) అధ్యయనం ప్రకారం 148 మీటర్లు లేదా 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా లేదని, ముంపులో సగానికి పైగా నదీగర్భంలోనే (మిగతా 2వ పేజీలో)



## విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు
# 9.50 లక్షల కోట్ల లక్ష్యం

**విశాఖ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులతో ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే కార్యాచరణ**

**పోర్టులు, ఏఐ డేటా సెంటర్లు, క్లీన్ ఎనర్జీకి పెద్దపీట**

**అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

అమరావతి, ఆగస్టు 5: ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లాను పారిశ్రామిక, ఆర్థిక, పర్యాటక, మౌలిక సదుపాయాల పరంగా సమానంగా అభివృద్ధి చేసేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా మొత్తం రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడులను తరువాయి 2 వ పేజీలో..



## గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో
# ప్రభుత్వం విఫలం

**బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత టి. హరీశ్ రావు**

గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశానికి ముందు తెలంగాణ జల హక్కులను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత టి. హరీశ్ రావు ఆరోపించారు.

హైదరాబాద్, ఆగస్టు 5 (మన దీపం): బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 18న హైదరాబాద్‌లో జరగనున్న జీఆర్ఎంబీ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు వేర్వేరుగా అజెండాలను సమర్పించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ సమర్పించిన అజెండాలో



# అవినీతి నిరోధంపై బ్రిక్స్ దేశాల ఏకాభిప్రాయం

బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్, ఆస్తుల పునరుద్ధరణ (అసెట్ రికవరీ) నిపుణుల నెట్‌వర్క్ సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. సరిహద్దులు దాటి జరిగే అవినీతి, అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్థులను అరికట్టేందుకు సభ్య దేశాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చాయి.

హైదరాబాద్, ఆగస్టు 5 (మన దీపం): సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో అక్రమ ఆస్తుల స్వాధీనం, నేరస్థుల అప్పగింత (ఎక్స్‌ట్రడిషన్), సమాచార మార్పిడిని వేగవంతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్థులను గుర్తించి పట్టుకునేందుకు బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టిషనర్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలన్న భారత ప్రతిపాదనకు సభ్య దేశాలు సానుకూలంగా స్పందించాయి. సమావేశాన్ని ప్రారంభించిన డీఓపీటీ కార్యదర్శి రచనా షా అవినీతిపై భారత్ “జీరో టాలరెన్స్” విధానాన్ని పునరుద్ఘాటించారు. సాంకేతికత (మిగతా 2వ పేజీలో)



## మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
# క్షమాపణలు

మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. తన ప్లాట్‌ఫాంలపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్‌ఏఎం), డీప్‌ఫేక్ కంటెంట్, నిర్వహణ లోపాలు అన్నింటికీ కలిపి జుకర్‌బర్గ్ బుధవారం కేంద్రానికి క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.

న్యూఢిల్లీ: మెటా ప్లాట్‌ఫాంలలో లోపాలపై ఆ సంస్థకు కేంద్రం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో సోషల్ మీడియా లో ప్రధాని వీడియో తొలగింపుపై కూడా కేం ద్రం మెటాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మూడు రోజుల్లోగా మెటా సీఈవో జుకర్‌బర్గ్ క్షమాపణలు -2 వ పేజీలో...




# 100 కాదు.. డయల్ 112

**పోలీసులు, అంబులెన్స్, ఫైర్ సహా 18 ఎమర్జెన్సీ సేవలు**

**కొత్త వ్యవస్థతో 2 నిమిషాల్లోపే స్పందన**

రాష్ట్రంలో అత్యవసర సేవల వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోలీసు సహాయం కోసం 100.. అగ్నిమాపక సేవల కోసం 101.. అంబులెన్స్ కోసం 108 వంటి వేర్వేరు నంబర్లకు కాల్ చేయాల్సి వచ్చేది. ఇక నుంచి అలాంటి అవసరం లేకుండా అన్ని రకాల అత్యవసర సేవలకు ఒకే నంబర్ 112ను అందుబాటులోకి వచ్చింది.

హైదరాబాద్, ఆగస్టు 5: తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) ఆధ్వర్యంలో రూపొందించిన నెక్స్ట్ జెన్ డయల్ 1 112 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టంను డీజీపీ సీవీ ఆనంద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలు మాత్రమే కాకుండా మహిళల భద్రత, చైల్డ్ హెల్ప్‌లైన్, విపత్తు నిర్వహణ, విద్యుత్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్ఆర్ఐ సహాయ కేంద్రం వంటి మొత్తం 18 రకాల అత్యవసర సేవలు ఒకే నంబర్ ద్వారా అందుబాటులోకి రానున్నాయని తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం: చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు. సంతానం కొన్ని విషయాలలో మీతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు తప్పవు. పాత ఋణముల ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

మిధునం: ఆర్థిక ఇబ్బందులు నుంచి కొంత వరకు బయటపడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: కొన్ని విషయాలలో అందరితో సమస్యలు కలుగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహం: బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపారమున స్నేహితుల నుంచి పెట్టుబడులు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి.

కన్య: చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ధన వ్యవహారాలలో లోటుపాట్లు తప్పవు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

తుల: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. కీలక వ్యవహారాలలో మిత్రుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

వృశ్చికం: దూర ప్రాంతాల ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది.

ధనస్సు: దైవ అనుగ్రహంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

మకరం: కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. కుటుంబ వాతావరణం మరింత చికాకు పరుస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

కుంభం: ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలలో సమర్థవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారములు అందుతాయి. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి.





# విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు 9.50 లక్షల కోట్ల లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో ప్రభుత్వ రంగం ద్వారా రూ.3.50 లక్షల కోట్ల పెట్టుబడులు, ప్రైవేట్ రంగం ద్వారా రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించేలా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రతి ప్రాజెక్టుకు గడువులు, అమలు విధానం, పెట్టుబడుల సమీకరణ వ్యూహాన్ని ముందుగానే ఖరారు చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధ ఆధారిత డేటా సెంటర్ల ఎకోసిస్టమ్‌ను విశాఖ ప్రాంతంలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా పోర్టు ఆధారిత పరిశ్రమలు, హైడ్రోజన్ ఉత్పత్తి, క్లీన్-టెక్ ఎనర్జీ, గ్రీన్ ఇండస్ట్రీస్, ఆధునిక తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పర్యాటక రంగాన్ని కూడా విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ప్రధాన భాగంగా పరిగణించాలని సీఎం సూచించారు. సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి, పర్యాటక కేంద్రాల ఆధునికీకరణ, రహదారులు, విమానాశ్రయాలు, పోర్టులు, రైల్వే అనుసంధానాన్ని బలోపేతం చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి కార్యక్రమాలను వీఈఆర్‌లో భాగంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి వల్ల భారీ స్థాయిలో పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పారిశ్రామికీకరణతో పాటు సేవారంగం, లాజిస్టిక్స్, సమాచార సాంకేతిక రంగాలు కూడా వేగంగా అభివృద్ధి చెందేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, భూసేకరణ, విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ. సాయిప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇంధనంగా మార్చే దిశగా సమగ్ర కార్యాచరణ రూపొందించి, నిర్ణీత గడువుల్లో అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు అమలుతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతుల పెరుగుదలతో పాటు అంతర్జాతీయ పెట్టుబడిదారులకు విశాఖ అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది

# అనుమతులు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని వివరించారు. 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే విద్యుత్ వినియోగం లేకుండానే గ్రావిటీ ద్వారా నీటిని అందించవచ్చని సీఎం తెలిపారు. అందువల్ల బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని సీఎం పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ, ఈ అంశంపై ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని తెలిపారు. ముందుగా కేంద్ర జల సంఘం (జఔజ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభిస్తామని, అనంతరం ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేమ్ నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం. అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ పాల్గొన్నారు.



# అవినీతి నిరోధంపై బ్రిక్స్ దేశాల ఏకాభిప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

ఆధారిత పాలన, పారదర్శకత, బలమైన సంస్థలతోనే అవినీతిని సమర్థంగా ఎదుర్కోవచ్చని ఆమె పేర్కొన్నారు.

పరారీలో ఉన్న నేరస్థుల జాడ గుర్తించేందుకు అనధికారిక సహకార వ్యవస్థకు సంబంధించిన సమాచార భాండాగారాన్ని ఏర్పాటు చేయడాన్ని సభ్య దేశాలు స్వాగతించాయి. అలాగే దర్యాప్తు సమయంలో వేగవంతమైన సమాచార మార్పిడికి ప్రామాణిక నమూనా ఫార్మాట్లను ఆమోదించాయి.

కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ పాలన, ఫిన్‌టెక్, వర్చువల్ డిజిటల్ ఆస్తుల వినియోగంతో అవినీతి, మనీలాండరింగ్‌ను అరికట్టే మార్గాలపై కూడా ప్రతినిధులు చర్చించారు.

సమావేశాల ముగింపులో అవినీతి నిరోధక చర్యల్లో ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడం, అక్రమ ఆస్తుల పునరుద్ధరణ వ్యవస్థను బలోపేతం చేయడం, పారదర్శకతతో కూడిన సాంకేతిక ఆధారిత పాలనను ప్రోత్సహించడంపై బ్రిక్స్ దేశాలు తమ నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించాయి.

# మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు

మొదటి పేజీ తరువాయి

చెప్పాలని కేంద్రం డిమాండ్ చేసింది. జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పాలని, లేకుంటే చట్టబద్ధమైన రక్షణ కల్పించే క్లాజ్ (సేఫ్ హార్బర్ (ప్రొటెక్షన్) కోల్పోతారని పార్లమెంట్ స్థాయీ సంఘం సూచించింది. దీనిపై చర్చించేందుకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో బుధవారం మెటా ప్రతినిధులు భేటీ అయ్యారు. ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. మెటా తరఫున సంస్థ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ జోయెల్ కాప్లన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రధాని వీడియో తొలగింపుపై మెటా ప్రతినిధులు వివరణ ఇచ్చారు. అభ్యంతరకర కంటెంట్‌ను ఎలా అనుమతించారంటూ కేంద్రం ప్రశ్నించింది. దీనిపై వివరణ కోరింది. 45 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం. సంస్థ తరఫున జరిగిన పొరపాట్లను ఆయన అంగీకరించారు. నిర్వహణా లోపాలపై విచారం వ్యక్తం చేసిన జుకర్‌బర్గ్.. మోదీతోపాటు, అన్నింటికీ క్షమాపణలు కోరారు.

# జలాల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

మంజూరైన అనుమతులను కూడా పునఃపరిశీలించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ సంబంధిత అధికార సంస్థల సమగ్ర పరిశీలన అనంతరం చట్టబద్ధమైన అనుమతులు పొందాయని, అలాంటి ప్రాజెక్టులను తిరిగి సమీక్షించాలనే అంశం జీఆర్‌ఎంబీ అజెండాలో ఎలా చేరిందని హరీశ్ రావు ప్రశ్నించారు.

గోదావరి జలాల్లో 383 టీఎంసీల వినియోగానికి ఉద్దేశించిన ప్రాజెక్టులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనుమతులు సాధించామని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టుకైనా అనుమతి తీసుకురాలేదని ఆరోపించారు. సమ్మక్క, పాలమూరు, వార్ధా వంటి ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తిరిగి వచ్చాయని, అదనపు నీటి కేటాయింపుల కోసం కూడా ప్రభుత్వం ఎలాంటి అనుమతులు పొందలేదని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సాధించిన ప్రాజెక్టుల అనుమతులను బలహీనపరిచేందుకు లేదా వెనక్కి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని ప్రశ్నించిన హరీశ్ రావు, తెలంగాణ సాగునీటి భవిష్యత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడనివ్వబోమని స్పష్టం చేశారు. జీఆర్‌ఎంబీ అజెండాలో ఇటువంటి ప్రతిపాదనలు చోటుచేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నారు.

# 100 కాదు.. డయల్ 112

మొదటి పేజీ తరువాయి

డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. దీంతో ప్రజలు వేర్వేరు హెల్ప్‌లైన్ నంబర్లు గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇక ఈ 112 సర్వీసుల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ప్రజల దగ్గరి నుంచి 112కు కాల్ వచ్చిన వెంటనే ఆ వ్యక్తి ఉన్న ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే అడ్వాన్స్‌డ్ లొకేషన్ టెక్నాలజీ ఈ వ్యవస్థలో ఉంది. దీంతో అత్యంత సమీపంలో ఉన్న పోలీస్, అంబులెన్స్ లేదా ఫైర్ సిబ్బందికి సమాచారం చేర్చుతారు. తక్షణమే వారిని సంఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటారు. గతంలో ఈ రెస్పాన్స్ తీసుకోవడానికి 3, 4 నిమిషాలు పట్టగా, ఈ సరికొత్త వ్యవస్థతో సుమారు 2 నిమిషాల్లోనే స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ 112 సర్వీసులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాల్ మేనేజ్‌మెంట్‌ను కూడా ప్రవేశపెట్టారు. కాల్ అందిన వెంటనే ఆపరేటర్లు లైవ్‌లో స్పందించి అవసరమైన విభాగానికి సమాచారాన్ని పంపిస్తారు. భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత టెక్నాలజీ సర్వీసులను కూడా 112 వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలంగాణ పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దేశంలో ఒకే ఎమర్జెన్సీ నంబర్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణలో ఈ వ్యవస్థను మరింత ఆధునికంగా రూపొందించామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

# దుబాయ్‌లో పాతబస్తీ యువతి మిస్సింగ్

హైదరాబాద్,ఆగస్ట్5 :దుబాయ్‌లో హైదరాబాద్ యువతి మిస్సింగ్ కలకలం రేపుతోంది. గత కొద్ది నెలలుగా ఆమె నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ కానీ.. సమాచారం కానీ లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని పోషించేందుకు వైద్య విద్య పూర్తి చేసిన ఓ యువతి (24) ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లింది. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కు వెళ్లిన ఆమె అక్కడి ఓ ఆస్పత్రిలో విధుల్లో చేరింది. దుబాయ్ వెళ్లిన తర్వాత సదరు యువతి కొంతకాలం పాటు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేది. అయితే గత నాలుగు నెలలుగా ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదు.

# శ్వేత సంపాదకీయం

గురువారం 6-8-2026

## ఉదయనిధి బరితెగింపు విమర్శలు!

అధికారంలో ఉంటే పెసరం మాటలు..రెచ్చగొట్టే ప్రసంగాలు..సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం.

ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు.

దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో,తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేదు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.



## రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది: జగన్

**దేవరపల్లిలో పొగాకు రైతులతో మాజీ ముఖ్యమంత్రి భేటీ**

**గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న ఆరోపణ**

**వ్యాపారులతో కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారని విమర్శ**

**రైతు సంక్షేమ పథకాలను రద్దు చేశారని ప్రభుత్వంపై మండిపాటు**



దేవరపల్లి, ఆగస్టు 5: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయం నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని జగన్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర లభించేదని, కొంతమంది రైతులు రూ.365 వరకు కూడా పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ధర రూ.236కు పడిపోయిందని, అదే సమయంలో సాగు ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల నుంచి కేవలం 21 శాతం పొగాకును మాత్రమే కొనుగోలు చేసిందని జగన్ ఆరోపించారు. మిగిలిన పంట కొనుగోలు విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. మార్కెట్‌లో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకే వదిలేసిందని అన్నారు. రైతుల కష్టాన్ని పట్టించుకునే పరిస్థితి ప్రభుత్వంలో కనిపించడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం విచారకరమని అన్నారు. రైతుల ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా కింద అదనపు ఆర్థిక సహాయం, ఉచిత పంటల బీమా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని జగన్ ఆరోపించారు. ఈ నిర్ణయాల వల్ల రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించే విధానాల కంటే సంక్షేమ పథకాల కోతలపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం విమర్శలను అణిచివేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని, రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## రూ.207 కోట్లతో పిఠాపురం రహదారుల అభివృద్ధి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గ్రామీణ రోడ్లకు మహర్దశ**

**రూ.100 కోట్లతో 611 రోడ్లు పూర్తి.. మరో 70 పనులు పురోగతిలో**

**మత్స్యకార గ్రామాలు, వ్యవసాయ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం**

**పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు**



పిఠాపురం, ఆగస్టు 5: పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. పల్లె నుంచి పట్టణం వరకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రూ.207 కోట్లతో 307 కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రోడ్లు--భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల నిధులతో చేపట్టిన పనుల్లో ఇప్పటికే రూ.100 కోట్ల వ్యయంతో 611 రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు తెలిపింది. సుమారు 152 కిలోమీటర్ల మేర రహదారులు అందుబాటులోకి రాగా, మరో 70కి పైగా రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొంది. లక్ష్యాల్లో 80 శాతం పనులు పూర్తవడంతో నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో రహదారులు మెరుగుపడ్డాయని వివరించింది.

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, దేవాలయాలు, ఆసుపత్రులు, వ్యవసాయ క్షేత్రాలు, మత్స్యకార గ్రామాలను అనుసంధానించే రహదారులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించింది. ఉప్పాడ తీర ప్రాంతంలో జెట్టీకి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయడంతో మత్స్యకారులకు రవాణా సౌలభ్యం కలిగిందని పేర్కొంది. మాయాపట్నం, కొత్తసూరాడపేట పునరావాస కాలనీల్లో 13 ఏళ్ల తర్వాత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపింది. అమరవిల్లి--రామన్నపాలెం బీచ్ రహదారిని రూ.88 లక్షలతో పునర్నిర్మించగా, కొండెవరం ప్రాంతంలో ఏడు సంవత్సరాలుగా దెబ్బతిన్న రహదారిని రూ.1.22 కోట్లతో పునరుద్ధరించి సుమారు 8 వేల మంది ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు పేర్కొంది.

అదేవిధంగా ముమ్మిడివారిపాడు గ్రామానికి శాశ్వత రహదారి నిర్మాణం, కొత్తపల్లి శ్మశానవాటికకు సీసీ రోడ్డు, పల్లెపండుగ--2.0 కార్యక్రమంలో భాగంగా పంట చేల మధ్య డొంక రహదారుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పార్టీ వెల్లడించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక రహదారి సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపింది. రహదారుల అభివృద్ధికి సంబంధించిన వినతులకే ప్రజల నుంచి అత్యధిక స్పందన వచ్చిన నేపథ్యంలో వాటిని ప్రాధాన్యంగా తీసుకుని పనులు చేపట్టినట్లు జనసేన పార్టీ పేర్కొంది. గ్రామీణ అనుసంధానం, వ్యవసాయాభివృద్ధి, మత్స్యకారుల సౌకర్యం, ప్రజల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పిఠాపురం నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతోందని వెల్లడించింది.




# జనగణన--2027 సన్నాహక కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి

**జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైన పత్రము**

**గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతం ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ: ఆగస్టు 5,2026: జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైన పత్రమని, గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతం, ప్రతి రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారంతోనే భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు సమర్థవం తంగా రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరే ట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో బుధవారం జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ నమోదుపై జిల్లాలోని స్టాటిస్టికల్ అధికారులకు నిర్వహించిన ఒకరోజు కార్యశాలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు ప్రామాణిక ఆధార పత్రంగా ఉ పయోగపడుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉ ంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వివరాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించిన అనంతరమే నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన--2027 సన్నాహక కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని పేర్కొన్న కలెక్టర్, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి విడతల వారీగా సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణతో పాటు అవసరమైన ఫారాలు, మార్గదర్శకాలను ముందుగానే అందుబాటు లో ఉంచి, వారి సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. శిక్షణ ఇచ్చినంత మాత్రాన సరిపోదని, క్షేత్రస్థాయి లో నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్, ధృవీకరణ వ్యవస్థలను సమర్థవం తంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించిన సమాచా రాన్ని సంబంధిత శాఖల ద్వారా తప్పనిస రిగా ధృవీకరించి, ఖచ్చితమైన గణాంకాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచిం చారు. జనగణన ప్రక్రియలో అవసరమైన సమాచారాన్ని అన్ని సంబంధిత శాఖల నుంచి సమన్వయంతో సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శిక్షణ కార్యక్రమానికి ముందు మండల తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవడం ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందిలో బాధ్యత పెరిగి, నాణ్యమైన సమాచారం అందుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఖచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారంతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణిక పత్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సహాయ స్టాటిస్టికల్ అధికారి మేక స్వాతి మాస్టర్ ట్రైనర్ గా వ్యవహరించారు.

## అతి తక్కువ ఫీజుతో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు"

అతి తక్కువ ఫీజు తో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు" చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా,, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆప్రకటలో ఆయన తెలిపారు. జర్నలిజంలో ఉ న్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం డ మాస్ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్, ప్రస్తుత ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయిన ప్రొ. డి.వి.ఆర్.మూర్తి ఆధ్వర్యంలోని వివిధ యూనివర్సిటీల జర్నలిజం డిపార్టుమెంట్ ప్రొఫెసర్ లతో కూడిన "బోర్డు ఆఫ్ స్టడీస్" ఈ డిప్లొమా కోర్సును రూపొందించిందని ఆయన తెలిపారు. ఎలెక్ట్రానిక్, సోషల్ మీడియా ల న్యూస్ చానెళ్లకు, పత్రికలకు ఉన్నత ప్రమాణాలతో పనిచేయ గలిగిన సామర్థ్యం ఈ కోర్సును నేర్చుకోవడంద్వారా అభ్యర్థులు పొందగలరన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం డ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొఫెసర్ పి. బాబీ వర్ధన్ "కోర్సు డైరెక్టర్ గా వ్యవహరిస్తారన్నారు. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం డ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొ. కె. జోతిర్మయి యూనివర్సిటీ తరపున కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారన్నారు. ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులు చే ;క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సోమవారం నుంచి శు క్రవారం వరకు ఉదయం గం. 8 నుంచి 9 వరకు, 9 నుంచి 10 వరకు రెండు క్లాసులు జరుగుతాయన్నారు. ఆన్ లైన్ (కరెస్పాండెన్సు) విధానంలో ఈ క్లాసులు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి అవుతున్న సమయంలో ప్రతి అభ్యర్థి కోర్సు డైరక్టర్ ఆధ్వర్యంలో అస్సైన్ మెంట్స్ రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులకు అస్సైన్మెంట్ మార్కులు కలిపి తుది ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడిస్తుందన్నారు.



# స్వయం ఏపీ బ్రాండ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ పై మంత్రి కొండపల్లి సమీక్ష

**MSME DPR యాప్‌ను స్త్రీ నిధి యాప్‌తో అనుసంధానంపై చర్చ**

**ప్రాసెసింగ్ చార్జీల మాపీపై SHG మహిళలకు అవగాహన కల్పించాలన్న మంత్రి**

అమరావతి / విజయవాడ, ఆగస్టు 5 : స్వయం ఏపీ బ్రాండ్ కింద సెర్ప్ మహిళలు తయారు చేసిన 65 ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలు పరిశీలిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మంత్రి విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సెర్ప్ డైరెక్టర్లతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సెర్ప్ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఎగుమతి, ముడిసరుకులు దిగుమతి చేసుకునే అవకాశాలు తెలుసుకునేందుకు ఆర్ప్ాచీ=ుతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిక్ వాహన నమూనాలో సౌరశక్తితో నడిచే మొబైల్ లాండ్రీ యూనిట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి దానిని ్రవీజు+ూ కింద ఒక సంస్థాగత వ్యాపారంగా ప్రోత్సహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల మహిళలచే వ్యాపార, సేవా మరియు పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేసే పురోగతిపై సమీక్షించి... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి "ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త " దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమ అమలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి, అక్కడ లైవ్‌లీహుడ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని... గ్రామీణ మహిళలు మరియు యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. చీ=ావీ కింద ఖీూ స్థాయిలో స్థాపించిన 163 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (జఎజం) పనితీరును సమీక్షించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. MSME అభివృద్ధి చేసిన DPR తయారీ యాప్‌ను స్త్రీ నిధి యాప్‌తో అనుసంధానంతో పాటు, SHG బ్యాంక్ లింకేజీ ప్రగతిని సమీక్షించి, SHG సభ్యులకు సంస్థాగత రుణాలు సులభంగా, నిరంతరంగా అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు SHG క్యాష్ క్రెడిట్ లిమిట్ (CCL) రుణాలపై వసూలు చేస్తున్న లోన్ ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, ఇన్స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు గురించి SHG మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన అన్ని SHGలు ఈ మినహాయింపుల ప్రయోజనాన్ని పూర్తిగా పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి ఆదేశించారు.




# APCOB ఫార్మేషన్ డే వేడుకల్లో కృష్ణా డీసీసీ బ్యాంక్‌కు ప్రతిష్ఠాత్మక "రికగ్నిషన్ ఆఫ్ ఎక్సలెన్స్" అవార్డు

విజయవాడ, ఆగస్టు 5: విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఆ్రాజుాదీ) ఫార్మేషన్ డే వేడుకల్లో, 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.15,000 కోట్లకు పైగా వ్యాపార పరిమాణం సాధించి అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు లిలికృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (ఖతీఅంష్ట్రఋ ఐజజదీ)లిలికు ప్రతిష్ఠాత్మక "=వఙశీస్త్రఅఔఅశీఅ శీట జుఞఎవశ్రీశ్రీవఅఎవ" అవార్డును ప్రదానం చేశారు.

ఈ అవార్డును రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (=జూ) డ సహకార శాఖ కార్యదర్శి శ్రీ బాబు.ఏ, ఈూ, ఆ్రాజుాదీ చైర్మన్ శ్రీ గన్నె వీరాంజనేయులు, ఆ్రాజుాదీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి. రామకృష్ణ గారి మీదుగా కృష్ణా డీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి శ్రీ నెట్టెం శ్రీ రఘురాం గారు అందుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీ నెట్టెం శ్రీ రఘురాం గారు మాట్లాడుతూ, ఈ అవార్డు కృష్ణా డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ల మండలి, సీఈఓ, అధికారులు, ఉద్యోగులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ూాజూ) ప్రతినిధులు మరియు సభ్య రైతుల సమిష్టి కృషికి లభించిన గౌరవమని పేర్కొన్నారు. రైతులకు మరింత మెరుగైన, పారదర్శకమైన, సాంకేతిక ఆధారిత బ్యాంకింగ్ సేవలు అందిస్తూ సహకార రంగంలో కృష్ణా డీసీసీ బ్యాంక్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి



చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాల డిసిసిబి చైర్మన్లు కృష్ణా డీసీసీ బ్యాంక్ సీఈఓ శ్రీ శ్యామ్ మనోహర్, బ్యాంకు ఉ న్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# బీసీ రక్షణ చట్టంపై సమీక్ష

**విజయవాడలో మంత్రుల సమావేశం**

**చట్ట రూపకల్పన వేగవంతం చేయాలని నిర్ణయం**

**బీసీల రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబాటు**

**సంక్షేమానికి సమగ్ర చట్టమే లక్ష్యమని వెల్లడి**

విజయవాడ, ఆగస్టు 5: రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ప్రతిపాదిత చట్టం రూపకల్పనపై విజయవాడలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు మంత్రులు, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై చట్టానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, ఎన్.ఎం.డి. ఫరూఖ్, సత్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బీసీల సంక్షేమం, రక్షణకు అవసరమైన నిబంధనలను చట్టంలో పొందుపరిచే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. చట్ట రూపకల్పన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. బీసీల ధన, మాన, ప్రాణ రక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, భద్రత, సంక్షేమాన్ని బలోపేతం చేసే విధంగా చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం అన్ని సూచనలను పరిగణనలోకి తీసుకుంటోందని పేర్కొన్నారు.

చట్ట రూపకల్పనలో ప్రజాప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలు కీలకంగా మారనున్నాయని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు. బీసీల హక్కుల పరిరక్షణకు సమగ్ర చట్టం తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ప్రతిపాదిత చట్టం అమల్లోకి వస్తే బీసీల భద్రత, సంక్షేమానికి మరింత బలమైన రక్షణ లభిస్తుందని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఈ చట్టం కీలక మైలురాయిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.



# మెటా ప్రతినిధులతో ఎంపీ భేటీ

**డిజిటల్ విధానాలపై అభిప్రాయాల మార్పిడి.. ఆన్‌లైన్ భద్రతపై విస్తృత చర్చ**

**బాధ్యతాయుత ఆవిష్కరణలపై దృష్టి.. సమ్మిళిత డిజిటల్ భవిష్యత్తే లక్ష్యమని వ్యాఖ్య**

న్యూఢిల్లీ, ఆగస్టు 5: మెటా ఇండియా పబ్లిక్ పాలసీ నాయకత్వ బృందంతో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. దేశంలో వేగంగా మారుతున్న డిజిటల్ వ్యవస్థ, ప్రజా విధానాలు, ఆన్‌లైన్ భద్రత, సాంకేతిక వేదికల పాత్రపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. భారత్‌లో డిజిటల్ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విధానపరమైన అంశాలపై పరస్పర అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఈ సమావేశం ద్వారా లభించిందని ఎంపీ పేర్కొన్నారు. డిజిటల్ సేవల విస్తరణతో పాటు వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

సాంకేతిక వేదికలు

బాధ్యతాయుతమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు సురక్షితమైన డిజిటల్ వాతావరణం ఏర్పాటులో కీలక పాత్ర పోషించాలని సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధానాలపై కూడా అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సాంకేతిక సంస్థల మధ్య ఇటువంటి నిర్మాణాత్మక చర్చలు దేశ డిజిటల్ భవిష్యత్తుకు ఎంతో అవసరమని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సమ్మిళిత, సురక్షిత, విశ్వసనీయ డిజిటల్ వ్యవస్థ నిర్మాణానికి పరస్పర సహకారం కీలకమని అన్నారు.

డిజిటల్ రంగంలో విధానపరమైన సంస్కరణలు, ఆన్‌లైన్ భద్రత, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ డిజిటల్ అభివృద్ధికి తోడ్పడే విధంగా ప్రభుత్వ విధానాలు, పరిశ్రమల భాగస్వామ్యం సమన్వయంతో ముందుకు సాగితే సురక్షితమైన, సమగ్ర డిజిటల్ భవిష్యత్తును నిర్మించవచ్చని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెమ్‌జెడ్‌కు భూములిచ్చిన రైతులకు పరిహారం

**37 మంది రైతులకు 31.57 కోట్ల చెక్కుల పంపిణీ**

**అద్దంకిలో రెన్యూవబుల్ ఎనర్జీ జోన్‌కు భూసేకరణ**

**స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాల లక్ష్యం**


**పారిశ్రామికాభివృద్ధికి కీలక ప్రాజెక్టుగా ప్రభుత్వం అభివర్ణన**



అద్దంకి, ఆగస్టు 5: అద్దంకి నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న రెన్యూవబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (రెమ్‌జెడ్) కోసం భూసేకరణలో భాగంగా భూములు అందించిన రైతులకు పరిహారాన్ని పంపిణీ చేశారు. అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ రాజాబాబుతో కలిసి 37 మంది రైతులకు రూ.31.57 కోట్ల పరిహార చెక్కులను అందజేశారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 175.41 ఎకరాల భూమిని రైతులు అందించినట్లు అధికారులు తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో సహకరించిన రైతులకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, ప్రాంతీయ అభివృద్ధికి వారు అందించిన సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగం పెంచుతోందన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని తెలిపారు. రామాయపట్నం పోర్టు, జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న అద్దంకి ప్రాంతంలో రెమ్‌జెడ్ ఏర్పాటు కావడం వల్ల అంతర్జాతీయ స్థాయి పునరుత్పాదక ఇంధన తయారీ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. దీంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన రైతులు ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భూములు అందించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు అద్దంకి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి దోహదపడటంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపునిస్తుందని అన్నారు. రెమ్‌జెడ్ అమలుతో పునరుత్పాదక ఇంధన తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు ఆకర్షించడంతో పాటు ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.



# అమరావతి నిర్మాణాలకు భద్రతే ప్రాధాన్యం

**రాజధాని పనులపై మంత్రుల సమీక్ష**

**భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు**

**ప్రపంచ స్థాయి రాజధాని లక్ష్యంగా ముందుకు ప్రభుత్వం**

**అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు**

అమరావతి, ఆగస్టు 5: తెలుగు జాతి గర్వించే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంత్రి నారాయణ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అమరావతి రాజధాని నిర్మాణ ప్రాంతాలను ఆమె బుధవారం పరిశీలించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, నిర్మాణ ప్రాంతాల్లో అమలవుతున్న భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. పనులు వేగంగా, నాణ్యతతో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అమరావతి కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలిచే రాజధాని అని అనిత పేర్కొన్నారు. నిర్మాణ పనులకు పూర్తి భద్రత కల్పించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రాజధాని అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఆమె, అభివృద్ధిని అడ్డుకునే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నిర్మాణ పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

రాజధాని అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక, సామాజిక పురోగతికి కీలకమని ప్రభుత్వం భావిస్తోందని, ప్రజల సహకారంతో అమరావతిని ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు కొనసాగుతాయని హోంమంత్రి వెల్లడించారు.

# పొగాకు రైతుల అంశంపై బహిరంగ చర్చకు సవాల్

**జగన్ ఆరోపణలు అవాస్తవమన్న అచ్చెన్నాయుడు**

**గణాంకాలతో చర్చకు రావాలని సవాల్**

**రైతుల కోసం రూ.100 కోట్ల సాయాన్ని ప్రస్తావించిన మంత్రి**

**ధరలు, కొనుగోళ్ల వివరాలు వెల్లడించిన అచ్చెన్నాయుడు**

అమరావతి, ఆగస్టు 5: పొగాకు రైతుల సంక్షేమంపై వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి సుమారు రూ.280 కోట్లు వెచ్చించామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలాగే 2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు తగ్గిన సమయంలో రైతులకు ప్రతి కిలోకు రూ.20 చొప్పున ఆర్థిక సహాయం అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2019లో 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి జరిగినప్పటికీ కేవలం 11.8 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. అనంతరం ఏడాది 128 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినప్పటికీ ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. పొగాకు ధరల విషయాన్ని ప్రస్తావిస్తూ 2019లో కిలో ధర రూ.142 ఉండగా, కూటమి ప్రభుత్వ హయాంలో 2024లో రూ.326, 2025లో రూ.300, 2026లో రూ.275గా నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు 241 మిలియన్ కిలోల ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు.

అధిక ఉత్పత్తి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం 100 మిలియన్ కిలోల పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ సాయం పంపిణీని గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, అంచనాకు మించి ఉత్పత్తి వచ్చినా అదే విధంగా కిలోకు రూ.10 చొప్పున సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అదనంగా కేంద్ర



ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50 వేల వడ్డీలేని రుణం అందిస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులను ఎవరు ఆదుకున్నారో, ఎవరు నిర్లక్ష్యం చేశారో ప్రజల ముందే తేల్చుకుందామని, బహిరంగ చర్చకు సిద్ధమేనా అని జగన్‌ను ప్రశ్నించారు.




## విన్నర్లకు ఇండియా
# ఘన స్వాగతం

కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి పతకాల పంట పండించి ఢిల్లీకి చేరుకున్న భారత క్రీడాకారులకు ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. ఏడు పసిడి పతకాలు గెలిచిన బాక్సర్లతో పాటు జూడోలో భారత్‌కు చరిత్రాత్మక స్వర్ణాన్ని అందించిన అస్మితకు ఎయిర్‌పోర్ట్‌లో వందలాది అభిమానులు స్వాగతం పలికారు. మెడలో పూలమాలలతో పాటు రూ. 50 నోట్లతో తయారుచేసిన దండ వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అస్మిత స్పందిస్తూ.. 'జూడోలో దేశానికి గోల్డ్ మెడల్ అందించాలనేది నా కల. గ్లాస్గోకు వెళ్లినప్పుడూ అదే నా మనసులో ఉండేది. భారత్‌కు వెళ్తే స్వర్ణంతోనే వెళ్లాలి అనుకునేదాన్ని' అని తెలిపింది.




## పాక్ క్రికెటర్ ఆమిర్‌కు
# ఇంగ్లండ్ పౌరసత్వం

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.




# పాక్ బాక్సర్ కుద్రతుల్లా అదృశ్యం

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఇటీవలే ముగిసిన కామన్వెల్త్ గేమ్స్-2026 వేదికగా ఒక షాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన స్టార్ బాక్సర్ కుద్రతుల్లా గేమ్స్ విలేజ్ నుంచి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. టోర్నీ ముగిసి పాకిస్థాన్ జట్టులోని ఇతర అథ్లెట్లు, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడం పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్)కు తీవ్ర అవమానకరమైన పరిస్థితిగా మారింది. కుద్రతుల్లా 57 కేజీల ఫెదర్‌వెయిట్ విభాగంలో పాకిస్థాన్ తరఫున కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. అయితే క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైన తర్వాత, ఆగస్టు 2న గేమ్స్ ముగిసి జట్టు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్న సమయంలో ఆయన ఎవరికీ చెప్పకుండా గ్లాస్గోలోని తన గది నుంచి కనిపించకుండా పోయాడు.






# వీవీఎస్‌కే బీసీసీఐ ఎస్!?




**భారత క్రికెట్‌లో మరో కీలక మార్పుకు రంగం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. జట్టు ఎంపిక బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది. ఆయన స్థానంలో భారత మాజీ స్టార్ వీవీఎస్ లక్ష్మణ్‌ను తీసుకురావాలని బీసీసీఐ పెద్దలు ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.**

రోహిత్ శర్మ భవిష్యత్తు చుట్టూ జరిగిన పరిణామాలు కూడా ఈ చర్చకు బలం చేకూర్చినట్టు తెలుస్తోంది. బీసీసీఐ ప్రధాన ఎంపిక కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ ఒప్పందం జూన్ 2026తో ముగిసింది. ఆ తర్వాత బోర్డు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆయన కొనసాగుతారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా కొత్త ముఖాన్ని తీసుకురావాలనే ఆలోచన సాగుతున్నట్టు సమాచారం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ పది మ్యాచ్‌ల్లో ఎనిమిది ఓటములు చవిచూసింది. ఈ ప్రదర్శనపై సమీక్ష సమావేశం నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సమావేశం జరగాల్సి ఉన్నా ఇప్పటికీ నిర్వహించలేదు. ఇప్పటికే భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లిపోయింది. దీంతో ఆ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే ఆసక్తి నెలకొంది.

# లంక జట్టు ఓనర్‌గా జహీర్

భారత జట్టు మాజీ పేసర్ జహీర్ ఖాన్ కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. మైదానంలో బౌలర్‌గా రాణించిన జహీర్, ఇప్పుడు వ్యాపారవేత్తగా మారి ఫ్రాంచైజీ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. శ్రీలంకలో జరిగే లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన జాఫ్నా కింగ్స్‌కు సహ యజమానిగాజహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించాడు. స్వీడన్ కేంద్రంగా పనిచేసే 'యాంకర్ స్పోర్ట్స్ ఏబీ' అనే గ్లోబల్ స్పోర్ట్స్ గ్రూప్, జాఫ్నా ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. ఈ సంస్థ అధినేత నాగేంద్ర సిద్ధాటమ్‌తో కలిసి జహీర్ ఖాన్ భాగస్వామి అయ్యాడు. దీంతో ఫ్రాంచైజీ పేరును 'యాంకర్ జాఫ్నా కింగ్స్'గా మార్చారు. ఈ సంస్థకు ఇప్పటికే యూరోపియన్ టీ20, కెనడా సూపర్ 60 లీగ్స్‌లో కూడా జట్లు ఉన్నాయి. గతంలో జాఫ్నా కింగ్స్ యాజమాన్యంపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రావడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. పాత యాజమాన్య బృందంలోని సహ యజమాని మంజోత్ కల్రాను ఈ కేసులో అరెస్ట్ చేయడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో యాంకర్ స్పోర్ట్స్ సంస్థ కొత్త యాజమాన్య హక్కులను దక్కించుకుంది. ఈ కొత్త బాధ్యతపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశాడు. "శ్రీలంక క్రికెట్‌లో ఎంతో ప్రతిభ ఉంది. అక్కడి బౌలింగ్ నైపుణ్యాలంటే నాకు ఎంతో గౌరవం. ఇప్పుడు యజమానిగా ఆ దేశ క్రికెట్‌లో భాగం కావడం ఉత్సాహంగా ఉంది" అని ఆయన అన్నాడు. జహీర్ వంటి దిగ్గజం రాకతో లంక యువ క్రికెటర్లకు గొప్ప మార్గనిర్దేశం లభిస్తుందని ఎల్‌పీఎల్ టోర్నమెంట్ డైరెక్టర్ సమంత దొడన్‌వేల హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌పీఎల్ చరిత్రలో జాఫ్నా కింగ్స్ జట్టు ఇప్పటివరకు 5 సీజన్లలో 4 సార్లు ఛాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించింది.






# ఇషాన్ కిషన్‌కు బ్యాంకు ఉద్యోగం!

స్పోర్ట్స్ కోటాలో ఇషాన్ కిషన్‌కు రిజర్వ్ బ్యాక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం లభించింది. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌కు బ్రేక్ రావడంతో ఇషాన్ కిషన్ విధుల్లో చేరాడు. పట్నాలోని ఆర్బీఐ రీజనల్ ఆఫీస్‌లో విధులు నిర్వహించాడు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది ఇషాన్ కిషన్‌తో ఫొటోలు దిగారు. అవి నెట్టింట వైరల్ అయ్యాయి. ఆటతో పాటు ఉద్యోగ బాధ్యతలూ నిర్వర్తించడంపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఆర్బీఐ అసిస్టెంట్ మేనేజర్‌గా ఇషాన్ కిషన్‌కు సుమారు రూ.1.22 లక్షల నుంచి రూ.1.24 లక్షల వరకు జీతం రానుంది. పీఎఫ్, ఇతర కంటింగ్స్ పోను అతనికి నెలకు రూ.1.08 లక్షల నుంచి 1.12 లక్షల జీతం వచ్చే అవకాశం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో అద్వితీయమైన ప్రదర్శనతో అనూహ్యంగా భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన ఇషాన్ కిషన్.. నిలకడైన ఆటతీరుతో జట్టు తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ప్రణాళికల్లోనే లేని ఇషాన్ కిషన్ చివరి నిమిషంలో జట్టులోకి వచ్చాడు. మెగా టోర్నీలో సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ అదే జోరు కొనసాగించాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో తడబడినా.. ఇతర బ్యాటర్ల కంటే మెరుగైన పరుగులే చేశాడు. జింబాబ్వే పర్యటనలో మళ్లీ తన ఫామ్ నిరూపించుకున్నాడు. ప్రస్తుతం భారత్ టెస్ట్ సిరీస్ ఆడనుండటంతో ఇషాన్ కిషన్‌కు సుదీర్ఘ విరామం లభించింది. టీమిండియా తదుపరి టీ20 సిరీస్ అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది. ఈ సిరీస్‌తోనే ఇషాన్ కిషన్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్నాడు. అయితే ఈ బ్రేక్‌లో దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్‌ను ఇషాన్ కిషన్ నడిపించనున్నాడు. ఆగస్ట్ 23 నుంచి దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది.




## నా ఫేవరేట్ కోచ్
# రవిశాస్త్రి: షమీ

టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ తన ఫేవరేట్ కోచ్ ఎవరో చెప్పారు. తాను గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలో ఎక్కువగా ఆడలేదని, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రిల హయాంలో మంచి క్రికెట్ ఆడానని తెలిపాడు. ఈ నలుగురిలో ఒకరిని ఎంపిక చేసుకోమంటే మాత్రం రవిశాస్త్రి ఎంచుకుంటానని చెప్పాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత మహమ్మద్ షమీ భారత్ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఫిట్‌నెస్ సాధించి దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటినా సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో యువ బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. పరోక్షంగా షమీ, భువనేశ్వర్ కుమార్ వంటి సీనియర్ పేసర్లు రిటైర్ అవ్వడమే ఉత్తమమని తెలియజేశాడు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌కు మహమ్మద్ షమీని తీసుకోవాలని, సౌతాఫ్రికా వంటి కండిషన్స్‌లో అతని అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న షమీని ఫేవరేట్ కోచ్ ఎవరు? అని ప్రశ్నించగా.. రవి శాస్త్రి పేరు చెప్పాడు. 'ఎవరు గొప్ప కోచ్ అనే పోల్చడం కాస్త కష్టమే. గౌతీ భాయ్ హయాంలో నేను ఎక్కువగా ఆడలేదు. నేను ఎక్కువగా రాహుల్ భాయ్, అనిల్ భాయ్, రవిశాస్త్రి హయాంలో మంచి క్రికెట్ ఆడాను. ఈ నలుగురిలో ఒకర్ని ఎంచుకోమంటే మాత్రం రవి భాయ్‌ను ఎంపిక చేసుకుంటాను. ఎందుకంటే ఆటగాళ్లకు అతను పూర్తి స్వేచ్ఛ ఇస్తాడు'అని చెప్పుకొచ్చాడు.



# నవ్వులతో అలరించనున్న కొరియన్ కనకరాజు

**మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన హారర్--కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'లిఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటించగా, ప్రముఖ హాస్యనటుడు సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. విడుదలకు ముందే సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో మంచి స్పందన వ్యక్తమవుతోంది.**



'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన హాస్య చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు మేర్లపాక గాంధీ మరోసారి తనదైన వినోదాత్మక శైలిని ఈ చిత్రంలో ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. తొలి భాగం నుంచి చివరి వరకు పలు హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా విరామానికి ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్‌లు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. వరుణ్ తేజ్, సత్య మధ్య సాగే హాస్య ఘట్టాలతో పాటు 'బుల్లిరాజు' పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా అలరిస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు భిన్నమైన కోణాలు కలిగిన పాత్రలో కనిపించనున్నాడు. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన అమాయక యువకుడు కనకరాజుగా ఒకవైపు కనిపిస్తే, కొరియా గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో మరోవైపు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పాత్రల మధ్య హావభావాలు, సంభాషణ తీరు, శరీర భాషలో వరుణ్ తేజ్ మంచి వైవిధ్యాన్ని ప్రదర్శించినట్లు చిత్రబృందానికి దగ్గరగా ఉన్నవారు చెబుతున్నారు. వినోదంతో పాటు నటనకు కూడా ప్రాధాన్యం ఇచ్చే పాత్రలో ఆయన ఆకట్టుకున్నారని సమాచారం. చిత్ర కథ కూడా ఆసక్తికరమైన నేపథ్యంలో సాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా పరిశ్రమలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ నటించారు. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటాయి. కొరియా నుంచి వచ్చిన ఒక సీసాలో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహించడంతో కథ కొత్త మలుపు తిరుగుతుంది. ఆ ఆత్మకు కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? కనకరాజు జీవితంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? చివరకు సమస్య ఎలా పరిష్కారమైంది? అనే అంశాల చుట్టూ కథ సాగుతుందని తెలుస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు చిత్రానికి మరింత బలం చేకూర్చాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



# తండ్రే దేవుడు.. దివ్యాంగుల పిల్లలను వదిలేయకండి

## నటి అభినయ భావోద్వేగం!

ప్రముఖ నటి అభినయ, ఆమె తండ్రి ఆనంద్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తమ కుటుంబ బంధాలు, అభినయ కెరీర్ మరియు ఆమె జీవిత దృక్పథం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అభినయ తన శారీరక లోపాన్ని ఎప్పుడూ ఒక సమస్యగా భావించలేదని, ప్రతీ సవాలును ధైర్యంగా ఎదుర్కొంటుందని ఆమె తండ్రి తెలిపారు. తండ్రే నా దేవుడు.. నానమ్మే నా ఊపిరి తమ కుటుంబ అనుబంధం గురించి అభినయ మాట్లాడుతుంటే ఉద్వేగానికి గురయ్యారు. "మా నాన్న నటుడు కావాలని కలలు కన్నారు, ఆయన కలను నేను నెరవేర్చడం ఎంతో సంతోషంగా ఉంది. నా దృష్టిలో మా నాన్న దేవుడితో సమానం" అని కొనియాడారు. అలాగే తానీ రోజు నడుస్తూ, సైన్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతున్నానంటే దానికి నానమ్మే కారణమని, ఆమె తనకు జీవితాన్ని ఇచ్చిందని రుణపడి ఉంటానని తెలిపారు. డిప్రెషన్‌కు చోటు లేదు తన పరిస్థితిని సహజంగానే అంగీకరించానని, జీవితంలో ఎప్పుడూ డిప్రెషన్‌కు గురికాలేదని అభినయ స్పష్టం చేశారు. చెన్నైలోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో డ్యాన్స్ ప్రదర్శించిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, నృత్యం పట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు. భవిష్యత్తులో పెళ్లి తర్వాత దేవుడి ప్లాన్ ఎలా ఉంటే అలా జరుగుతుందని అన్నారు.

# సెప్టెంబరు 25న నాని కీర్తి పోటీ?

న్యాచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, కయాదు లోహర్ కథానాయికగా మాస్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు సిద్ధమవుతోంది. 'దసరా' తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అదే తేదీన ప్రముఖ నటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'డోరతి'లిచిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇప్పటికే అధికారిక ప్రకటన వెలువడింది. ప్రముఖ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం 'డోరతి' విడుదల తేదీని తమిళ వెర్షన్‌కు మాత్రమే ఖరారు చేసినప్పటికీ, తెలుగు అనువాద చిత్రాన్ని కూడా అదే రోజున విడుదల చేస్తే బాక్సాఫీస్ వద్ద నాని, కీర్తి సురేష్ చిత్రాల మధ్య నేరుగా పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. 'దసరా' చిత్రంలో కలిసి నటించిన నాని, కీర్తి సురేష్ మంచి స్నేహితులుగా గుర్తింపు పొందారు. అలాంటి ఇద్దరు నటీనటుల చిత్రాలు ఒకే తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తాయనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే రెండు చిత్రాల విడుదల తేదీలు ఖరారయ్యే వరకు పరిస్థితిలో మార్పులు వచ్చే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. విడుదల తేదీలపై చిత్రబృందాల నుంచి త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.









# శోభిత పాత వ్యాఖ్యలు వైరల్

## సోషల్ మీడియాలో చర్చ

అక్కినేని కుటుంబ కోడలు, ప్రముఖ నటి శోభిత ధూళిపాళ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. అయితే ఈసారి కారణం ఆమె కొత్త సినిమా కాదు.. గతంలో రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు. కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం మళ్లీ వైరల్ అవుతోంది. దీంతో సామాజిక మాధ్యమాల్లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఇంటర్వ్యూలో శోభిత తన రాజకీయ ఆలోచనల గురించి మాట్లాడుతూ, తనకు వామపక్ష భావజాలంపై ఆసక్తి ఉందని, భవిష్యత్తులో ఒక రోజు కమ్యూనిస్టు సిద్ధాంతాలే విజయం సాధిస్తాయని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో పెద్దగా చర్చకు రాని ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి వెలుగులోకి రావడంతో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. వీడియో వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు శోభిత వ్యాఖ్యలను విమర్శిస్తున్నారు. సినీ రంగంలో విజయవంతమైన కెరీర్‌తో పాటు విలాసవంతమైన జీవితం గడుపుతూ కమ్యూనిస్టు భావజాలం గురించి మాట్లాడటం విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.



# విలన్‌గా మెప్పించిన ప్రదీప్ రావత్‌కు వీడ్కోలు

తెలుగు, హిందీ సహా పలు భారతీయ భాషల చిత్రాల్లో విలక్షణ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి సినీ పరిశ్రమను విషాదంలో ముంచెత్తింది. 'శత్రువు', 'గజినీ' వంటి చిత్రాల్లో ప్రతినాయకుడిగా తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన భౌతికంగా దూరం కావడం సినీ రంగానికి తీరని లోటుగా భావిస్తున్నారు. దాదాపు 150కు పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించిన ప్రదీప్ రావత్ తన నటనతో ప్రత్యేక ముద్ర వేశారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం ఆయన సుమారు రూ.41 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించినట్లు తెలుస్తోంది. కెరీర్ అత్యున్నత దశలో ఉన్న సమయంలో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పారితోషికం అందుకునే విలన్ నటుల్లో ఆయన ఒకరిగా నిలిచారు. కష్టపడి ఎదిగి నటుడిగా, ఆర్థికంగా కూడా ఉన్నత స్థాయిని చేరుకున్నారు.

# బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన కాజల్ అగర్వాల్ 'ది ఇండియా స్టోరీ'!

**'లక్ష్మీ కళ్యాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమై, స్టార్ హీరోలందరి సరసన నటించి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక కాజల్ అగర్వాల్‌కు హిందీలో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన సామాజిక కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం 'ది ఇండియా స్టోరీ' థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది.**



చేతన్ డి.కె దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్‌తో పాటు శ్రేయస్ తల్పడే, మురళీ శర్మ ముఖ్య పాత్రలు పోషించారు. నిత్యం మనం తినే ఆహార పదార్థాలు, కూరగాయలలోని రసాయన కల్తీ మరియు పురుగుమందుల తయారీలోని అవినీతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. కల్తీ ఆహారం వల్ల బ్లడ్ క్యాన్సర్‌తో ఒక చిన్నారి మరణించగా, ఆ పాప తండ్రి కార్పొరేట్ వ్యవస్థపై చేసే న్యాయపోరాటంలో కాజల్ అగర్వాల్ లాయర్‌గా మద్దతుగా నిలుస్తుంది. జీ స్టూడియోస్ సమర్పణలో సాగర్ బి. షిండే నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ ఆలస్యం కారణంగా జూలై 24న కేవలం హిందీ వెర్షన్‌లోనే విడుదలైంది. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా మొదటి రెండు రోజుల్లో వరుసగా రూ.16 లక్షలు, రూ.25 లక్షలు మాత్రమే రాబట్టింది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467